అమ్మ కడుపు నిండగా..

• గర్భిణులకు పోషకాహార కిట్లు • ఈ నెల నుంచి అమలుకు చర్యలు

- మాతా, శిశు మరణాల రేటు తగ్గించడమే లక్ష్యంగా ముందడుగు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కసరత్తు
- ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో రంగంలోకి జిల్లా వైద్యారోగ్యశాఖ



సాక్షి,మేడ్చల్ జిల్లా: మాతా, శిశు మరణాల రేటు తగ్గించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం గర్భిణులకు పోషకాహార కిట్లు అందించనుంది. ఈ మేరకు ఇటీవ నూతన సచివాలయ ప్రారంభోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సంబంధిత ఫైల్‌పై సంతకం చేశారు. ఇప్పటికే ఆసుపత్రుల్లో బాలింతలకు కేసీఆర్ కిట్లు, నగదు అందజేస్తున్నారు. మరింత మార్పు తీసుకొచ్చేందుకు గర్భిణులకు పోషకాహార కిట్లు అందించడంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రంలో ఐదు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా గత డిసెంబర్ మూడో వారం నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అక్కడ సత్ఫలితాలు రావడంతో అన్ని జిల్లాల్లో అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

◆ రెండు విడతలుగా..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అల్వాల్, కుత్బుల్లాపూర్, మేడ్చల్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 793 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 23,332 మంది గర్భిణులు ఉన్నారు. అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 269 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 9,115 మంది, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 313 కేంద్రాల్లో 9,851 మంది, మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 4,366 మంది గర్భిణులు ఉన్నారు. వీరందరికీ రెండు విడతలుగా పోషకాహార కిట్లు అందించనున్నారు. కొన్ని ప్రాంతాల్లో సరైన పోషకహారం తీసుకోక మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గర్భిణులకు పోషకాహారం అందించి రక్తహీనత సమస్యను నివారించేందుకు చర్యలు తీసుకోనున్నారు. గర్భం దాల్చిన 13 నుంచి 24 వారాల మధ్య మొదటి కిట్, తర్వాత ఒక నెల రోజులకు అంటే 28–34 వారాల మధ్య రెండో కిట్ అందజేస్తారు. ఇందులో గర్భిణుల రక్తహీనతను తగ్గించేందుకు కిలో పోషకాహార పదార్థాల పొడి (మదర్ హార్లిక్స్), కిలో ఖర్జూర, ఐరన్ సిరప్ 3, నెయ్యి 500 గ్రాములు, అల్బెండజోల్ మాత్రలు, తాగడానికి అవసరమైన కప్పు ఉంటాయి. మొదటి కిట్ బుట్ట రూపంలో ఇస్తే రెండోది సంచి రూపంలో ఇస్తారు.

◆ ఈ నెల నుంచే అమలు..

ప్రభుత్వ ఆదేశాల ఈనెల నుంచి గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్.పుట్ల శ్రీనివాస్ తెలిపారు. పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకుంటూ,... వైద్యుల సూచనలు పాటిస్తే గర్భిణుల్లో రక్తహీనతకు అవకాశం ఉండదని, తల్లి,బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా...

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్ పర్సన్ దీపిక

మేడ్చల్: పట్టణంలోని 15వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి కౌన్సిలర్ హరికృష్ణ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందరూ విధిగా కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు కంటి అద్దాలు తీసుకోవాలన్నారు.

చెత్త సేకరణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ తదితరులు

మేడ్చల్: చెత్తను సేకరించే కార్మికులకు ప్రజలు వేర్వేరుగా తడి ,పొడి చెత్తను ఇవ్వాలని రాయిలాపూర్ సర్పంచ్ నర్మద గోపాల్‌రెడ్డి అన్నారు.స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా రాయిలాపూర్ గ్రామంలో అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మావతి, ఎంపీఓ రవి, కార్యదర్శులు, వార్డు సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

కీసర: నాగారం మున్సిపాలిటీలో శనివారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నాగారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్లశ్రీధర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, తదితరులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్ శ్రేణులంతా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

మురుగు నీటికి అడ్డుకట్ట వేస్తాం



పొలాలను పరిశీలిస్తున్న కమిషనర్ తదితరులు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి 3వ వార్డు లో పంట పొలాల్లోకి కాలనీల నుండి వెలువడే మురుగు నీరు వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు అన్నారు. కౌన్సిలర్ దేవ తో శుక్రవారం ఆయన మురుగు నీరు కలుస్తున్న పంట పొలాలను పరిశీలించారు. మురుగు నీరు పొలాలల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి పంటలు దెబ్బతినకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ విజయలక్ష్మీ, ఆర్ఐ రాంచందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్

ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించాడు. అంత్యక్రియల నిమిత్తం రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజుముదిరాజ్, వార్డు సభ్యులు అంజనేయులు, నేతలు సత్యనారాయణ ముదిరాజ్, జంగయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం





స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో వెలసిన శ్రీ అలివేలు మంగ సహిత శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల విగ్రహ మూర్తులను మండపంలో ప్రతిష్ఠించి కల్యాణం నిర్వహించారు. మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సర్పంచ్‌లు గీతశ్రీనివాస్, వెంకటేశ్‌గౌడ్, ఎంపీటీసీ రామారావు ముదిరాజ్, ఆలయ చైర్మన్ వేణుగోపాల్‌ముదిరాజ్, ఈఓ భాగ్యలక్ష్మీ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిరుడి లక్ష్మీనరసింహ ముదిరాజ్ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజుముదిరాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, జంగయ్యముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, వార్డు సభ్యుడు హరీశ్, జంగయ్య, కృష్ణ, ప్రభాకర్, ఆలయ డైరెక్టర్లు శంకరయ్య, నవీన్, కుమార్, యాదగిరి, నరసింహ, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మామూళ్లు ఇస్తేనే బిల్లులు ఇస్తారా?

దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్ల ధర్నా

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలంటే అధికారులు మాములు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పలువురు కాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు శ్రీను, చరణ్, సైదులు, కొమురయ్య మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు సకాలంలో చెల్లించకుండా డీఈఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ వేధిస్తున్నారని ఆరోపించారు. లంచాలు ఇచ్చిన వారికే ముందు బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. లక్షల రూపాయలు అప్పు చేసి పనులు పూర్తి చేశామని, ఇప్పుడు తమకు రావాల్సిన బిల్లులు సరైన సమయంలో రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోవాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్క్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మన్‌తో తమకు ఎందుకు బిల్లులు చెల్లించడం లేదని వాగ్వాదానికి దిగారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మున్సిపల్ ఉన్నాతాధికారులు స్పందించి దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో అధికారుల అవినీతిపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మేడ రవి సేవలు ఎనలేనివి



నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జవహర్‌నగర్: పేదల ఇళ్ల స్థలాల కోసం నిరంతరం పోరాడిన ఉద్యమ నాయకుడు మేడ రవి సేవలు ఎనలేనివని ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యదర్శి షేక్ షావలి అన్నారు. శుక్రవారం జవహర్‌నగర్‌లోని దళిత భవన్‌లో పీవోడబ్ల్యూ నాయకురాలు పుణ్యవతి ఆధ్వర్యంలో కారల్‌మార్క్స్ జయంతిని పురస్కరించుకుని డాక్టర్ మేడ రవి యాదిలో 137వ మేడే సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రవి సతీమణి జోత్స్న విప్లవ కార్మిక వర్గానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మతోన్మాద శక్తులు ప్రజల మధ్య విద్వేశాలు రెచ్చగొడుతున్నాయని , విద్యను కార్పొరేటీకరణ, కాషాయికర చేస్తున్నారన్నారు. కారల్‌మార్క్స్ సిద్ధాంతాలను ప్రజలకు చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అల్లూరి సావిత్రిముదిరాజ్, గద్దం సదానందం, మబ్బు బాలు, ఎండీ పాషామియా, యాకస్వామి, పూర్ణచందరావులతో పాటు పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మేడ్చల్‌రూరల్: టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ప్రగతినగర్‌కు చెందిన హరినాథ్‌రెడ్డి, హరీశ్‌కుమార్ బైక్‌పై తూప్రాన్ నుంచి ఇంటికి వెళ్తుండగా మేడ్చల్ పట్టణంలో 44వ జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బుద్ధుడు చూపిన మార్గాన్ని అనుసరించాలి



బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జవహర్‌నగర్: ప్రతి ఒక్కరూ బుద్ధుడు చూపిన మార్గాన్ని అనుసరించాలని మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్, ప్రధాన కార్యదర్శి మొగలిపాక పరశురాం అన్నారు. శుక్రవారం గౌతమ బుద్ధుని జయంతిని పురస్కరించుకుని జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని నలంద బౌద్ధ విహార్‌లో బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌతమ బుద్ధుని జ్ఞానమార్గం సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. శాంతియుత మార్గంతో ఏదైనా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో బుద్ధవిహార్ సభ్యుడు రాహుల్ కధమ్, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, అనిల్‌ముదిరాజ్, పద్మారావు, వినీల్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేలోగా ఇల్లు గుల్ల



చెల్లాచెదురైన వస్తువులు

కీసర: బంధువుల ఇంటికివెళ్లి వచ్చేలోగా ఇంట్లో దొంగలు పడి సర్వం దోచుకెళ్లిన సంఘటన నాగారం మున్సిపల్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. కీసర పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగారం మున్సిపాలిటీ, కమలాబాయినగర్‌లో ఉంటున్న వెంకటయ్య ఐదు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి భువనగిరికి వెళ్లాడు. శుక్రవారం ఇంటికి తిరివచ్చే సరికి గుర్తుతెలియని వ్యక్తులు గునపంతో ఇంటి కిటికీ తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి బెడ్‌రూంలోని బీరువాలో ఉన్న రూ. 2 లక్షల నగదు, 4 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి, పాస్‌పోర్ట్ ఎత్తుకెళ్లారు. బాధితుడు వెంకటయ్య సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న డీఐ ఆర్.బి.నాయక్, ఎస్ఐలు జగన్‌రెడ్డి, మధు ఆధారాలు సేకరించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి



డీఎంకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

మేడ్చల్: మండల పరిధిలోని గౌడవెల్లి గ్రామ రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ రైల్వే శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన గురువారం రైల్ నిలయంలో డివిజన్ రైల్వే సూపరింటెండెంట్ సూర్య ప్రకాష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. స్టేషన్ లో మూత్రశాలలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ఇతర వసతులు కల్పించాలని కోరారు.

బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని డీఎంకు వినతి

మేడ్చల్, నగరంనుండి గ్రామానికి బస్సులు నడపాలని మేడ్చల్ ఆర్టీసీ డీఎం సుధాకర్ ను సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ కోరారు. గ్రామానికి అదనపు బస్సులు నడపాలని, కళాశాలలు, స్కూల్స్ సమయాలలో సర్వీసుల సంఖ్యను పెంచాలని కోరారు.

05ఎండిసి103: రైల్వే సూపరింటెండెంట్ కు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్ సురేందర్ ముదిరాజ్

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ స్మిత

కీసర: గ్రామాల్లో నర్సరీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎల్‌పీఓ స్మిత అన్నారు. శుక్రవారం నర్సంపల్లి గ్రామంలో పర్యటించిన ఆమె పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని వైకుంఠధామం, డంపింగ్‌యార్డులను పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. యాద్గార్‌పల్లి గ్రామంలోని నర్సరీని మండల పరిషత్ అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌రాజు, సత్తమ్మ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్కులను అభివృద్ధి చేయాలి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలో పార్కులను అభివృద్ధి చేయాలని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఆమె జీహెచ్ఎంసీ ఈఈ నాగేందర్ హార్టికల్చర్ అధికారి మేధాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని బ్యాంక్ కాలనీ పార్క్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, బాలాజీ ఎన్‌క్లేవ్ పార్కులో బోర్లు ఎత్తు పెంచాలని, కల్యాణపురి పార్కులో వాకింగ్ ట్రాక్, పిల్లలకు క్రీడా పరికరాలను ఏర్పాటు చేయాలని కోరారు. పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఈ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

మల్లాపూర్: మధురా చారి ట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల నాచారంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల్లో అవసరమైన 110 మందికి శుక్రవారం నాచారం బాబానగర్ సెంట్ ఏంజెల్స్ హైస్కూల్లో కళ్ల అద్దాల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాగిడి లక్ష్మారెడ్డి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ 20 ఏళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్య క్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కంటి ఆపరేషన్లు, కంటి అద్దాలు, మందుల పంపిణీ, పేద మహిళలకు ఉపాధి కల్పన లక్ష్యంగా కుట్టు మెషిన్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ వర్క్ శిక్షణ, ఉచిత కంప్యూటర శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రోత్సాహకాలు, స్టడీ మెటీరియల్, నిరుద్యోగులకు జాబ్ మేళా తదితర కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, భద్రయ్య, ఫసియుద్దీన్, వంజరి సంతోష్, చందు, మల్లేష్ యాదవ్, మునిభేగం, లీలావతి, భారతమ్మ, సుజాత నాయక్ పాల్గొన్నారు.



ముంపు నివారణకు చర్యలు

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలో వరద ముంపు నివారణకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని సత్తమ్మనగర్, మల్లారెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. రానున్న వర్షాకాలంలో ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాల కారణంగా సత్తమ్మనగర్ ముంపునకు గురవుతుందని నీరు ఎప్పటికప్పుడు వెళ్లే విధంగా ఔట్‌లెట్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కార్పొరేటర్‌ను కోరారు. దీనిపై ఆమె స్పందిస్తూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

మేడ్చల్: మండల పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో విద్యుత్ సమస్య లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ అన్నారు. గ్రామంలో ఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్ ఫార్మర్‌ను ఆయన ఉపసర్పంచ్ పెంటమ్మతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పోచారం: అన్నోజిగూడలోని వెంకటసాయినగర్‌లో ఏర్పాటు చేసిన 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులతో కలిసి మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోఓల్టేజీ సమస్యతో, పాటు విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, విద్యుత్ శాఖ ఏడీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ సతీష్, బీఆర్ఎస్ నాయకులు నల్లవెల్లి శేఖర్, జితేందర్ నాయక్, కేఎం రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, సోమేష్, రాములు, గణేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

కీసర: గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన నిరుపేద కుటుంబాలకు మంత్రి మల్లారెడ్డి తమ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి రూ 5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేయడం అభినందనీయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, కీసర సర్పంచ్ నాయకపు మాధురి అన్నారు. శుక్రవారం కీసర గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దానోల్ల గంగమ్మ, ముద్దంగుల హనుమమ్మ, పల్లపుదుర్గ, ఆరవేమాబుల్ మల్లమ్మ కుటుంబాలకు రూ 5 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు . కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామారం సుజాత, బీఆర్ఎస్ నేతలు,గుర్రం శ్రీదర్‌రెడ్డి, గోరంటి ప్రవీణ్, వెంకటేష్, మిట్టపల్లి రాఘవేందర్‌గౌడ్, తుడుం శ్రీనివాస్, చినింగనిబాల్‌రాజ్, రాగుల గణేష్, ఉపాధ్యక్షులు సుమన్‌బన్ని పరమేష్, వెంకటేష్, చెట్టిమధు, తదితరులు పాల్గొన్నారు.

గోధుమకుంటలో : గోధుమకుంట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పుట్ట పోచమయ్య, పుట్టకృష్ణగౌడ్ కుటుంబసభ్యులకు మంత్రి మల్లారెడ్డి ట్రస్టు నుండి రూ 5 వేల చొప్పున గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంజనేయులు, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ కోసమే...

- పెయింటర్ హత్యకేసులో వీడిన మిస్టరీ
- ఇద్దరు నిందితుల అరెస్ట్

జవహర్‌నగర్: కౌకూర్‌లో ఓ పెయింటర్‌ను దారుణంగా హత్య చేసిన కేసును జవహర్‌నగర్ పోలీసులు 6 గంటల్లో ఛేదించారు. జవహర్‌నగర్ సీఐ సీతారాం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు జిల్లాకు చెందిన సురేష్(38) కౌకూర్ జనప్రియలో పేయింటర్‌గా పని చేస్తూ హనుమాన్ దేవాలయం సమీపంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఈ నెల 3న పని వెళ్లి వచ్చిన అతను ఫుల్లుగా మద్యం సేవించి కౌకూర్ పరిధిలోని పాడుబడిన ఇంటి వద్ద పడిపోయాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మహారాష్ట్రకు చెందిన పెయింటర్లు అజయ్ యువరాజ్, రాజు స్పృహ లేకుండా పడి ఉన్న సురేష్‌ను గుర్తించి అతని జేబులో ఉన్న సెల్‌ఫోన్ అమ్మేసి మద్యం తాగాలని భావించారు. సెల్‌ఫోన్ తీస్తుండగా సురేష్ వారిని గుర్తించడంతో దొరికిపోతామోననే భయంతో టవల్‌తో సురేష్ గొంతుకు బిగించారు. అనంతరం సెల్‌ఫోన్‌తో పాటు అతడి జేబులో ఉన్న రూ.60 తీసుకున్నారు. అయినా సురేష్ కదులుతూ ఉండడాన్ని గుర్తించిన వారు బండరాయితో మోది అక్కడి నుండి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. 6 గంటల్లో నిందితుల్లో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం



శ్రీసాయినగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నందికంటి శ్రీధర్

అల్వాల్: ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర శుక్రవారం వినాయక్‌నగర్‌లోని శ్రీసాయినగర్, గోకుల్‌నగర్ తదితర ప్రాంతాల్లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నందికంటి శ్రీధర్ గడప గడపకు తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, రోడ్లు, దోమలు, కుక్కల బెడద, ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సంతోష్, మీడియా కన్వీనర్ గుత్తి రాంచందర్, ఎంఆర్. శ్రీనివాస్ యాదవ్, సాయికుమార్, దుర్గాసాయి, మోమిన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.